క్లుప్తంగా

ఘనంగా వేణుగోపాలస్వామి కల్యాణం



వేణుగోపాలస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

కడియం: మురమండ గ్రామంలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామివారి కల్యాణం సోమవారం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు బృందావనం వెంకటశేషాచార్యులు, వెంకటసాయి వరప్రసాద్ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తెల్లవారుజాము నుంచే ప్రారంభమైన ప్రత్యేక పూజల్లో ఆలయ ధర్మకర్త నందమూరి సూరిబాబు, సూర్యకుమారి దంపతులు కూర్చున్నారు.

వక్తృత్వ పోటీల్లో చిన్నారుల ప్రతిభ



కడియం శాఖా గ్రంథాలయంలో చిన్నారులు

కడియం: స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి శెట్టిపల్లి శ్రీదేవి నిర్మల ఆధ్వర్యంలో ఆరో రోజు వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా సోమవారం నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో చిన్నారులు ఉత్సాహంగా పాల్గొని, తమ ప్రతిభను చాటుకున్నారు. తమకు ఆసక్తి ఉన్న అంశంపై చిన్నారులు నిర్ణీత సమయం పాటు ఆకట్టుకునే విధంగా మాట్లాడాల్సిందిగా పోటీ నిర్వహించారు. ఈ పోటీలో పలువురు చిన్నారులు పాల్గొన్నారు. 108 వైద్య సిబ్బంది ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణేతలకుగా వ్యవహరించి చిన్నారులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అలాగే వినడంలో నైపుణ్యం, పుస్తక సమీక్ష, సోషల్ స్టడీస్ గురించి నారాయణ, దేవి, సురేష్‌లు వివరించారు. సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

సెబ్ సిబ్బంది విస్తృత దాడులు



నిందితుడితో ఇన్‌స్పెక్టర్ హనుశ్రీ, సిబ్బంది

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆఫీసర్ పిట్టా సోమశేఖర్ ఆదేశాల మేరకు సోమవారం రాజమహేంద్రవరం సెబ్ సౌత్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ, సిబ్బందితో కలిసి రాజానగరం మండలం భూపాలపట్నంలోని సారా తయారీ కేంద్రాలపై విస్తృత దాడులు నిర్వహించారు. ఈ దాడులలో ఒక కేసు నమోదు చేసి, 120 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 2400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. పిడింగొయ్యి గ్రామానికి చెందిన గెద్దం రాజకుమార్‌ను అదుపులోకి తీసుకోగా, రాజానగరం మండలం రఘునాథపురానికి చెందిన పలివెల వీర వెంకట సత్యనారాయణ అలియాస్ బుజ్జి పరారయ్యాడు. అతడి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నట్లు సౌత్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ హనుశ్రీ తెలిపారు.

న్యాయవాది రమ్యకృష్ణకు అభినందనలు



రాజమహేంద్రవరం సిటీ: ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం లైబ్రరీ సెక్రటరీగా నగరానికి చెందిన న్యాయవాది కోదాటి రమ్యకృష్ణ ఎంపిక కావడంపై రాజమహేంద్రవరం బార్ అసోసియేషన్ సభ్యులు సోమవారం అభినందనలు తెలిపారు. రమ్యకృష్ణ 2011లో జీఎస్‌కేఎమ్ న్యాయ కళాశాలలో ఎల్ఎల్‌బీని పూర్తి చేసి, న్యాయవాదిగా నగరంలో కొంతకాలం ప్రాక్టీసు చేశారు. ప్రస్తుతం అమరావతి హైకోర్టులో ప్రాక్టీస్ చేస్తున్నారు. అక్కడ ఇటీవల జరిగిన ఎన్నికలలో లైబ్రరీ సెక్రటరీగా ఎన్నికయ్యారు. ఆ బాధ్యత చేపట్టిన మొదటి మహిళగా గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లైబ్రరీ సెక్రటరీగా లైబ్రరీ నిర్వహణ, విస్తరణ దిశగా సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తానని తెలిపారు.

బంగారు ఆభరణాల చోరీ

అనపర్తి: మండలంలోని పొలమూరు చెందిన అర్చకుడు గుండు వెంకటరమణయ్య ఈ నెల 14న కుటుంబ సభ్యులతో కలిసి తీర్థయాత్రకు వెళ్లాడు. ఈ నెల 19న అర్చకుడి ఇంటిలో పని మనిషిగా పనిచేస్తున్న అప్పయ్యమ్మ ఇంటి పనులు నిమిత్తం వచ్చేసరికి ఇంటి తాళాలు పగులకొట్టి ఉండడాన్ని గమనించి యజమానికి ఫోన్ చేసి సమాచారం అందించింది. దీంతో 20వ తేదీ ఉదయం వెంకటరమణయ్య ఇంటికి వచ్చి చూడగా ఇంటి లోపల బీరువా తలుపులు తెరిచి అందులో బట్టలు, వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలోని సుమారు 240 గ్రాముల బంగారు ఆభరణాలు, వెండి పళ్లెం, వెండి పట్టీలతో పాటు ఇతర వెండి వస్తువులు దొంగిలించుకు పోయారని ఆయన గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు, ఇంట్లో బీరువా తాళాలు పగులకొట్టి చోరీ చేశారని అనపర్తి పోలీసులకు వెంకటరమణయ్య ఫిర్యాదు చేశారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు సర్వం సిద్ధం



రాజమహేంద్రవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల

- రాజమహేంద్రవరం జూనియర్ కళాశాలలో దరఖాస్తుల విక్రయం
- అందుబాటులో జనరల్‌తో పది ఒకేషనల్ కోర్సులు

కంబాలచెరువు: రాజమహేంద్రవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియేట్‌లో ప్రవేశాలకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. అందులో భాగంగా 2024 మార్చిలో పదో తరగతి పాసైన విద్యార్థులు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు అవసరమైన దరఖాస్తుల విక్రయం ఈ నెల 15 నుంచి మొదలైంది. రాజమహేంద్రవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు, నగరంలోని ప్రైవేట్ ఇంటర్ కళాశాలు ప్రవేశాలకు సిద్ధమవుతున్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు పూర్తి నిబంధనలను పాటిస్తూ ప్రవేశాలు చేపట్టాల్సి ఉంది.

జనరల్, ఒకేషనల్ గ్రూపులు

జూనియర్ కళాశాలలో జనరల్ గ్రూపులైన ఎంపీసీ, బైపీసీ, సీఈసీలలో ఇంగ్లీషు, తెలుగు మీడియం బోధన అందుబాటులో ఉంది. అలాగే ఒకేషనల్లో ఆఫీస్ అసిస్టెంట్ (ఏవో), అక్కౌంట్స్ అండ్ టాక్సేషన్ (ఏఅండ్‌టీ), కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (సీఎస్ఈ), మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ (ఎంఎల్‌టీ), మల్టీపర్పస్ హెల్త్ వర్కర్స్ మేల్, ఫిమేల్ (ఎంపీహెచ్‌డబ్ల్యూ), మెకానికల్ అండ్ ఆటో మొబైల్ టెక్నీషియన్ (ఎంఅండ్ ఏటీ), హోటల్ మేనేజ్‌మెంట్ (హెచ్‌వో), కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ (సీటీ), ఎలక్ట్రికల్ టెక్నాలజీ (ఈటీ), ప్రింటింగ్ టెక్నాలజీ (పీటీజీ) తదితర కోర్సులలో ప్రవేశాలు పొందవచ్చు.

మొదటి ఫేజ్‌లో..

మొదటి ఫేజ్‌లో భాగంగా జూన్ నెలాఖరు వరకు దరఖాస్తులు స్వీకరించి ప్రవేశాలు ఇవ్వనున్నారు. కళాశాల కార్యాలయంలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి. పూర్తి చేసిన దరఖాస్తుతో పాటు, సంబంధిత ధ్రువీకరణ పత్రాలు జిరాక్స్ కాపీలను జత చేసి అందజేయాలి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో 1400 మంది పైగా విద్యార్థులుండగా, మొదటి సంవత్సరంలో ఏటా జనరల్, వృత్తి విద్యాకోర్సుల్లో సుమారు 800 మంది పైగా చేరుతుంటారు. కళాశాలలో జనరల్, వృత్తి విద్యాకోర్సుల్లో మొత్తం 49 మంది అధ్యాపకులు ఉన్నారు.

తరగతులు సిద్ధం



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పదో తరగతి పాసైన విద్యార్థులు అధిక సంఖ్యలో వచ్చి దరఖాస్తులు ఇస్తున్నారు. నూతన విద్యాసంవత్సరంలో విద్యార్థులకు ఏమాత్రం ఇబ్బంది లేకుండా తరగతులను సిద్ధం చేశాం. కళాశాలలో జనరల్, ఒకేషనల్ కోర్సుల్లో ప్రవేశాలు ఇస్తున్నాం.

– ఎస్ఎస్‌వీఎల్ నర్సింహం, ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల



సమావేశంలో మాట్లాడుతున్న టీకే విశ్వేశ్వరరెడ్డి

గోదావరి ప్రాంత పవిత్రతను కాపాడాలి

రాజమహేంద్రవరం సిటీ: కోటిలింగాల దేవస్థానం సమీపంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఈట్ స్ట్రీట్ ఏర్పాటు చేయవద్దని, అలాగే గోదావరి గట్టు వెంబడి మాంసాహార వంటకాలను ఎట్టి పరిస్థితుల్లో విక్రయించడానికి వీల్లేదని నగరపాలకసంస్థ కమిషనర్ దినేష్‌కుమార్‌కు రాజమహేంద్రి వారసత్వ సంపద పరిరక్షణ కమిటీ విజ్ఞప్తి చేసింది. స్థానిక వేంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో కమిటీ వ్యవస్థాపకుడు టీకే విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమిటీ నిర్ణయానికి సానుకూలంగా స్పందించకపోతే ఆందోళన చేపట్టడానికి కూడా సిద్ధంగా ఉన్నామన్నారు. ఆ ప్రాంతంలో ఇటువంటి కార్యకలాపాలు చేపడితే పవిత్రతకు భంగం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలను చర్చించి కీలక తీర్మానాలను ఆమోదించారు. కళాకేంద్రంలోని గంధం నాగ సుబ్రహ్మణ్యం హాలును నగరంలో కవులు, సాహితీ వేత్తలు కవి సమ్మేళనాలు, పుస్తకావిష్కరణ కార్యక్రమాలు, సాహితీ సభలకు ఉచితంగా వినియోగించుకోవచ్చని తెలిపారు. కేవలం విద్యుత్ బిల్లును కార్పొరేషన్‌కు చెల్లిస్తే సరిపోతుందని వెల్లడించారు. టౌన్‌హాల్ రోడ్డులోని కందుకూరి వీరేశలింగం పుర మందిరం ఆధునీకరణ పనులు ఇప్పటికే పూర్తయ్యాయని, త్వరితగతిన ప్రారంభించి అందుబాటులోకి తెచ్చేందుకు పుర మందిరం అధ్యక్షుడు మద్దూరి శివ సుబ్బారావుతో మాట్లాడటం జరిగిందన్నారు. ఈ విషయాన్ని కమీషనర్‌కు కూడా వివరించామని త్వరలోనే అందుబాటులోకి వస్తుందన్నారు. రాళ్లబండి సుబ్బారావు మ్యూజియం పనులు త్వరితగతిన పూర్తిచేసి అందరికి అందుబాటులోకి తేవాలని విజ్ఞప్తి చేశారు. బొమ్మూరులో పొట్టి శ్రీరాములు యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న సార్వత్రిక విద్యాపీఠం అలాగే కొనసాగించాలని తీర్మానం చేశారు. సమావేశంలో కమిటీ కన్వీనర్ కృష్ణకుమార్, సభ్యులు పట్నాయక్, ఎల్వి ప్రసాద్, కేకే సంజీవరావు, దేశిరెడ్డి బలరామ నాయుడు, మాదిరాజు శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీఎన్‌కేయూతో క్రీడాకారులకు చేయూత



సమావేశంలో పాల్గొన్న బీఎన్‌కేయూ ప్రతినిధులు

ప్రకాశం నగర్: భారతీయ నవీన క్రీడా ఉత్సవ్ (బీఎన్‌కేయూ) ట్రస్ట్ ద్వారా వివిధ క్రీడా పోటీలు నిర్వహించి, క్రీడాకారులకు ఆర్థికంగా చేయూత అందిస్తామని ట్రస్ట్ కార్యదర్శి విత్తనాల కుమార్ తెలిపారు. స్థానిక కాలఫ్యూజన్ చెస్ అకాడమీలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఎన్‌కేయూ కార్యక్రమాల్లో భాగంగా తొలుత కోటి రూపాయల వ్యయంతో అంతర్జాతీయ ఫీడే రేటింగ్ చెస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. అక్టోబర్ 19 నుంచి 25 వరకూ, డిసెంబర్ 24 నుంచి 26 వరకూ రెండు అంతర్జాతీయ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆంధ్ర చెస్ అసోసియేషన్ కార్యదర్శి భీమారావు మాట్లాడుతూ ఈ టోర్నమెంట్‌లను ఏపీలో అంతర్జాతీయ క్రీడాకారులకు అనువుగా పూర్తి మౌలిక సదుపాయలు ఉండే ప్రదేశంలో నిర్వహిస్తామని తెలిపారు. క్రీడాకారులకు ఉపకార వేతనం అందించేందుకు కూడా ట్రస్ట్ సన్నాహాలు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ కోశాధికారి సురేష్ కుమార్, ఉపాధ్యాకుడు ఉదయ్ కుమార్, ఆర్గనైజర్లు లీలాకుమార్, మనోహర్ పాల్గొన్నారు.

రుడా చైర్మన్ సూర్యప్రకాశరావు పరామర్శ



చిన్నాను పరామర్శిస్తున్న రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు

రాజమహేంద్రవరం సిటీ: మాతృవియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ నాయకుడు రాయపురెడ్డి చిన్నాను రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు సోమవారం పరామర్శించారు. స్థానిక ఏవీఏ రోడ్డులోని షీలానగర్ మూడో వీధిలోని చిన్నా స్వగృహానికి ఆయన వెళ్లారు.

ఈ నెల 17న చిన్నా మాతృమూర్తి నాగమణి మృతి చెందారు. ఈ మేరకు రౌతు వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం కేబుల్ ఆపరేటర్ పంపన శ్రీను బావ బావమరిది కాశా శ్యాం ప్రసాద్ మృతికి సూర్యప్రకాశరావు సంతాపం తెలిపారు. స్థానిక తాడితోట ఇందిరా నగర్‌లో శ్యాం ప్రసాద్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్ వాకచర్ల కృష్ణ ఉన్నారు.

గుమ్ములూరులో పోలీస్ కార్డన్ సెర్చ్



పోలీసులకు సూచనలు ఇస్తున్న సీఐ నాగ మురళి

మధురపూడి: కోరుకొండ మండలం గుమ్ములూరు గ్రామంలో సోమవారం పోలీస్ కార్డన్ సెర్చ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కోరుకొండ సీఐ అడపా నాగ మురళి విలేకరులతో మాట్లాడుతూ వివాదాస్పద గ్రామాల్లో అవాంచనీయ సంఘటనలు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సెక్షన్ 144 అమలులో ఉండడం, కౌంటింగ్ వరకూ జాగ్రత్తలు తీసుకునే కార్యక్రమంలో భాగంగా అనుమానితులు, రికార్డులు లేని వాహన చోదకుల నుంచి మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకుంటామన్నారు. గుమ్ములూరులో రికార్డులు లేని వారి నుంచి ఐదు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఆయా యజమానులు రికార్డులు చూపి వాటిని తీసుకెళ్ల వచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్సై ఆనందకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



వాహనాలను పరిశీలిస్తున్న పోలీసులు

వేసవి శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



గ్రంథాలయంలో మాట్లాడుతున్న కోళ్ల బాబు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఇన్నీసుపేట శాఖాగ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఇన్నీసుపేట కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ కోళ్ల అచ్యుత రామారావు (బాబు) సూచించారు. స్థానిక ఇన్నీసుపేట శాఖా గ్రంథాలయంలో రాజమహేంద్రి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. నీతికథలు చెప్పడం, యెగా, చదరంగం, వేదిక్ మ్యాథ్స్, లలిత సంగీతం తరగతులు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న కోళ్ల బాబు మాట్లాడుతూ విద్యార్థులందరూ చదువుతో పాటు విజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు రెడ్డి బాబు, ట్రస్ట్ వ్యవస్థాపక కార్యదర్శి మతల రమేశ్, ట్రస్ట్ అధ్యక్షుడు చలుమూరి సత్యనారాయణ, సభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాసు, బొడ్డు శ్రీనివాసు, గ్రంథాలయాధికారి శ్రీదేవి పాల్గొన్నారు.

చినుకు పడితే ఆందోళనే..



పాలిటెక్నిక్ కళాశాల పరిపాలనా విభాగంలో గదుల్లోకి చేరిన నీరు (ఫైల్)

- జీఎంఆర్ పాలిటెక్నిక్ ఉద్యోగుల అవస్థలు
- పరిపాలనా విభాగ భవనం అధ్వానం
- మరమ్మతుల పేరుతో శ్లాబ్‌ను తవ్వేసిన కాంట్రాక్టర్
- అలాగే వదిలేయడంతో తప్పని అవస్థలు


రాజమహేంద్రవరం రూరల్: వర్షం కురిస్తే చాలు బొమ్మూరులోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల ఉద్యోగులు ఆందోళనకు చెందుతున్నారు. వారి కార్యాలయాల్లోకి నీరు చేరి, కంప్యూటర్లు, ఇతర విలువైన తడిచిపోతూ ఉండడమే దీనికి కారణం. ఈ నెల ఏడో తేదీన కురిసిన భారీ వర్షానికి ప్రిన్సిపాల్, పరిపాలనా విభాగంలోని గదులు పూర్తిగా తడిసి ముద్దయ్యాయి. వాటిలో మోకాళ్ల లోతు నీరు చేరింది. బీరువాలతో పాటు, కంప్యూటర్, ఇతర సామగ్రి తడిచి పోయాయి.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం

బొమ్మూరు జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలోని ప్రిన్సిపాల్, పరిపాలనా విభాగం ఉన్న భవనం శిథిలావస్థకు చేరింది. ఆ భవన మరమ్మతు పనులను ఆర్‌అండ్‌బీకి సాంకేతిక విద్యాశాఖ అప్పగించింది. సదరు ఆర్‌అండ్‌బీ అధికారులు టెండరు ద్వారా కాంట్రాక్టర్‌ను ఎంపిక చేసి పనులను ప్రారంభించారు. అయితే ఆ కాంట్రాక్టర్ భవనం శ్లాబును పగులగొట్టి, ఆ వ్యర్థాలను కూడా తొలగించకుండా వదిలేశాడు. ఇక భవన నిర్మాణ పనులు చేపట్ట లేదు.

మోకాళ్లలోతు నీటిలో..

వర్షం కురిస్తే చాలు శ్లాబ్ ద్వారా నీరు కింద ఉన్న గదుల్లోకి చేరుతోంది. దాదాపు మోకాళ్ల లోపు నీరు నిల్వ ఉండిపోతోంది. ఆయా గదుల్లోని కంప్యూటర్లు, స్కానర్లు, బీరువాలు, బల్లలు పూర్తిగా తడిచిపోతున్నాయి. దీంతో అధికారులు చేసేది లేక కంప్యూటర్లు, ఇతర వస్తువులపై ప్లాస్టిక్ సంచులను వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇది జరిగి రెండు వారాలు గడుస్తున్నప్పటికీ ఆర్‌అండ్‌బీ అధికారులు, సదరు కాంట్రాక్టర్ నిర్మాణం విషయాన్ని పట్టించుకోవడం లేదు. ప్రస్తుతం రెండు రోజులుగా చినుకులు పడుతున్నారు. కొంచెం భారీ వర్షం కురిస్తే ఇబ్బందులు మళ్లీ మొదలవుతాయి. దీంతో ఉద్యోగులు భయాందోళనకు గురవుతున్నారు.



పాలిటెక్నిక్ కళాశాల భవనంపై పగులగొట్టిన శ్లాబ్



గోడల నుంచి కారుతున్న నీరు (ఫైల్)

కాపవరం.. పాలనకు కేంద్రం



శిథిల భవనంగా మారిన నాటి సమితి కార్యాలయం

- అప్పట్లో సమితికి కేంద్రం
- ప్రస్తుతం మండల కార్యకలాపాలకు నిలయం

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరం గ్రామానికి ఎంతో ఘన చరిత్ర ఉంది. ఈ గ్రామం ఎప్పుడూ పాలనకు కేంద్రంగానే నిలిచింది. అప్పట్లో కోరుకొండ సమితికి కేంద్రంగా విరాజిల్లింది. మండల వ్యవస్థ వచ్చాక పాలనకు కేంద్ర బిందువుగా మారింది. అప్పట్లో సమితి కార్యకలాపాల నిర్వహణలో ప్రముఖ పాత్ర పోషించింది. కోరుకొండ, సీతానగరం, గోకవరం మండలాలకు సమితి కేంద్రంగా కాపవరంలో కార్యకలాపాలు నిర్వహించేవారు. 1986 సంవత్సరం వరకూ ఈ విధంగానే నడిచింది. ఇక్కడ అన్ని ప్రభుత్వ శాఖల కార్యాలయాలు, ఆయా శాఖల అధికారుల క్వార్టర్లు ఉండేది. ఈ ప్రాంతం నిత్యం రద్దీగా, ఎంతో కోలాహలంగా ఉండేది. 1987 జనవరి 15వ తేదీ నుంచి సమితికి బదులుగా మండల వ్యవస్థ అమలులోకి వచ్చింది. నాటి ఎన్టీఆర్ ప్రభుత్వం మండల వ్యవస్థను తీసుకొచ్చింది. నాటి నుంచి పలు మార్పులు జరిగాయి. ప్రభుత్వ శాఖలకు చెందిన ఉన్నతాధికారుల క్వార్టర్లు కార్యాలయాలయ్యాయి. నాటి నుంచి ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ఇక్కడే నిర్వహిస్తున్నాయి. సమితి నుంచి మండల వ్యవస్థకు మారినా కాపవరమే పాలన కీలకంగా నిలిచింది.

ప్రభుత్వ శాఖల పేర్లు మార్పు

కోరుకొండ సమితి కాలంలో ప్రభుత్వ శాఖల పేర్లు మండల వ్యవస్థ వచ్చాక మార్పు చెందాయి. నాటి బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌ను నేడు ఎంపీడీఓగా పిలుస్తున్నారు. నాటి ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్‌ను నేడు ఎంఈఓగా మార్పు చెందారు. నాటి బాలబడి వ్యవస్థ నేడు అంగన్‌వాడీగా మారింది.



కాపవరంలోని మండల అభివృద్ధి అధికారి కార్యాలయం

సినిమాలు

శ్యామల	: ఆ ఒక్కటీ అడక్కు
సూర్యమినీ	: కింగ్‌డమ్ ఆఫ్ ప్లానెట్ ఆఫ్ దిఏప్స్
సూర్యప్యాలస్	: అపరిచితుడు
స్వామి	: కృష్ణమ్మ
శివజ్యోతి	: గీతాంజలి మళ్ళీ వచ్చింది
అనుశ్రీ	: ది గ్యారీఫీల్డ్ మూవీ
రాజా	: రత్నం
ఊర్వశి	: బాక్
రంభ	: మిరల్
మేనక	: నటరత్నాలు, ప్రసన్నవదనం
అప్సర	: కింగ్‌డమ్ ఆఫ్ ప్లానెట్ ఆఫ్ దిఏప్స్
కుమారి	: ఆది
నామవరం	
వీఎస్ మహల్	: కృష్ణమ్మ
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: కింగ్‌డమ్ ఆఫ్ ప్లానెట్ ఆఫ్ దిఏప్స్
కడియం	
వెంకటసూర్య	: ఆ ఒక్కటీ అడక్కు

వృద్ధుల రక్షణ బాధ్యత వారి పిల్లలదే..

కంబాలచెరువు: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో వృద్ధుల హక్కుల పరిరక్షణపై సంబంధిత శాఖల అధికారులు, ఎన్‌జీవోలకు సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ బాబు మాట్లాడుతూ వయసు పైబడిన తల్లిదండ్రులను మర్యాదగా ప్రేమగా చూసుకోవాల్సిన బాధ్యత వారి పిల్లలపై ఉందన్నారు. వారి కనీస అవసరాలను సమకూర్చకపోయినా, వారితో అగౌరవంగా ప్రవర్తించినా చట్టపరమైన చర్యలు తీసుకునే హక్కు వృద్ధులకు ఉందన్నారు. దీని కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థను ఆశ్రయించవచ్చని, ఆర్‌డీవో ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. నల్సా వయోవృద్ధులకు న్యాయ సేవల పథకం 2016, వివిధ రకాల దస్తావేజులు, వాటి రద్దు ప్రక్రియలు, రివర్స్ మోరేజ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం 35 మందికి వృద్ధులకు గుర్తింపు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో పరిష్కృతి స్వచ్ఛంద సంస్థ చైర్మన్ డీవీకే రమేష్, జిల్లా సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేకే సంజీవరావు, సీనియర్ సిటిజన్ ప్రజా సంక్షేమ వేదిక ప్రెసిడెంట్ అశోక్ కుమార్ జైన్, పారా లీగల్ వలంటీర్ జీవీఎస్ఎస్ వరప్రసాద్, డిసబుల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.